# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JULY - 2000

# సంక్షిప్త వార్తలు

2000వ సంవత్సరము జూన్ 7,8,9 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా సింగంపల్లిలో స్కిన్నర్ గార్డెన్ క్రీస్తుసంఘం ఆధ్వర్యములో బైబిలు తరగతులు మరియు బహిరంగ సువార్త కూటములు నిర్వహించబడెను. పగటి వేళలలో పురుషులకు, స్త్రీలకు, యౌవనులకు విడివిడిగా తరగతులు నిర్వహించబడెను. ప్రతిరాత్రి బహిరంగ సువార్త కూటములు జరిపించబడెను. ఈ బైబిలు తరగతులకు, సువార్త కూటములకు పలుప్రాంతముల నుండి వచ్చిన జనులు పెద్దసంఖ్యలో హాజరైరి. సోదరులు బి. జాషువా (ఏలూరు), బి. జీవన్ (విజయవాడ), సి.హెచ్. క్రిష్టాఫర్ (చిత్తూరు), ఎ. సహదేవుడు (తాడేపల్లిగూడెం), ఎ. గణేష్ (నిడదవోలు), యస్.జె. బెన్హర్ (తణుకు), జాషువా గూటం (కాకినాడ) మరియు తదితరులు వాక్యపరిచర్యలో పాలుపొందిరి. సోదరులు యమ్. సామ్యూల్ రాజు గారు, వారి కుమార్లు జాన్‌డీన్, విజయకుమార్ గార్లు చక్కటి ఏర్పాట్లు చేసిరి. ఈ సువార్త కూటముల ఫలితముగా జూన్ 9వ తేదీనాడు 15 మంది, 11వ తేదీనాడు 10 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరని సామ్యూల్ రాజుగారు తెలియజేసిరి.

జూన్ 8, 9, 10 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నెహ్రూ కోలనీలో అక్కడి క్రీస్తుసంఘము సువార్త కూటములు జరిపించిరి. కూటములకు పలు ప్రజలు హాజరైరి. స్థానిక సువార్తికులు బి.జోషీరావ్ గారు, సానబోయిన రాయప్పగారు, తదితరులు వాక్యపరిచర్య చేసిరి. కూటముల అనంతరం ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

జూన్ 12వ తేదీ సోమవారంనాడు అమెరికాలో విద్యనభ్యసించుచున్న జాన్‌రిక్కీ గూటంగారు వేసవి సెలవులకు కాకినాడలో తమ స్వగృహమునకు క్షేమముగా చేరుకొనిరి. ఆయన ఆగష్టు 20 వ తేదీ వరకు భారతదేశములో యుందురు.

జూన్ 18వ తేది ఆదివారం తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలులో రంగపుచెర్వు హరిజన కోలనీలో సువార్త కూటము జరిగెను. అక్కడ బండి మోషేగారు వాక్యపరిచర్య చేయుచున్నారు. సోదరులు కె. రత్నకుమార్‌గారు,

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**
**P.O. Box 80, Kakinada, A.P. 533 001**
**Phone : 0884 - 363722**
**Editor :**
**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 20 | జూలై 2000 | సంచిక 12

## 2000 సంవత్సరముల పురాతన సంఘము !

( The Church 2000 Years old ! )

అన్నిటికంటె పురాతన సంఘము ఏది ? సంఘవయస్సు అత్యంత ప్రాముఖ్యమైనది. లేఖనములలో చెప్పిన దినమున ఆరంభమైన సంఘము గాక మరేదియు కూడ దైవికమైనది కాదు. ఈలోకములో యున్న 400 డినామినేషనులన్నిటికంటె ముందుగా, 2000 సంవత్సరములకు పూర్వమే స్థాపింపబడిన ఒక సంఘము ఉన్నదని తెలిసికొనుట చాల సంతోషకరమైన సంగతి ! అవును, ఈనాడు అందరును దానిలో సభ్యులుగా యుండు తరుణము కలిగియున్నారు.

క్రైస్తవలోకములో కనబడుచున్న విభజనలు, జగడములు గూర్చి నేటి లోకము విసుగుజెంది యున్నది. విశ్వాస ప్రమాణిక కర్తలనుండి, పోపులనుండి, మానవ డినామినేషన్ల నుండి ఆదిమ సంఘమునొద్దకు పయనించు ఆశ్చర్యకరమైన

ఉద్యమము ఈనాడున్నది. మొదటి శతాబ్దములో దేవుని వాక్యము ఏమిచేసెనో దానినే అది ఈనాడును చేయగలదు ! మనకుఅదే ప్రభువు ఉన్నాడు, అదే పరలోక నిరీక్షణ, అదే బైబిలు ఉన్నది. మరియు ఆదిలో వారివలెనే మనమును అదే సంఘ సభ్యులము కాగలము. దేవుని కుమారునిచే నిర్మింపబడిన ఆదిమ సంఘములో సభ్యులమై యుండగలమని తెలిసికొనుట ఆనందదాయకము.

## సంఘ జన్మదినము

యేసు పరలోకమునకు ఆరోహణుడైన తరువాత క్రీ॥శ॥ 33వ సంవత్సరమున పెంతెకొస్తు పండుగదినము సంఘ జన్మదినము (అపొ.కా. 2). క్రీస్తు దాని నిర్మాణికుడు (మత్తయి 16.18). ఆదిలో అది యెట్లుండెను ? ఆరాధనలో ప్రతి ఆదివారము పాటలు పాడుట, ప్రార్థనచేయుట, వాక్యోపదేశము జరిగించుట, ప్రభురాత్రి భోజనములో పాలుపొందుట, కానుకలిచ్చుట జరిగేది (అపొ.కా. 20:7; 2:42). బోధలో అయితే దేవుని వాక్యము తప్ప మానవ ప్రమాణములేవి బోధింపబడేవి కావు. పాలనపద్ధతిలో ప్రతి స్థానిక సంఘములో పెద్దలు, పరిచారకులు, పరిశుద్ధులు ఉండేవారు. ఐక్యతలో సంఘము ఒక్కటే యుండెను. రక్షింపబడిన వారందరిని ప్రభువు చేర్చే ఒకే ఒక్క దైవికసంస్థ యుండేది, అదే సంఘము (అపొ.కా. 2:47)

అదంతా ఈనాడు శోచనీయముగా మారిపోయింది. ఇప్పుడు చీలికలు, గుంపులు ఒక రోగమువలె పెరుగుచు సువార్తకు అభ్యంతరము కలుగ జేయుచున్నవి. అయితే మిత్రులారా, అందరు ఒకే క్రొత్త నిబంధన సంఘమునకు చెందవలెనని, ఒకే సంగతులను విశ్వసించవలెనని, విభజనలు ఏమియు ఉండ కూడదని దేవుని చిత్తమై యున్నది (1 కొరింథీ 1:10). ప్రతి సంఘములోను ఒకే సంగతులను బోధించినట్లు పౌలుచెప్పెను (1 కొరింథీ 4:17). ఏలయనగా అప్పుడు ఒకే విశ్వాసము, ఒకే బోధ, ఒకే సంఘము ఉండెను.

3.

## ఐక్యతకు మార్గము

అయితే అదెట్లు సాధించగలము ? బైబిలుకు సరియైన ఘనతనిచ్చుట ద్వారా సాధించగలము. బైబిలు పరిపూర్ణమైనది, సంపూర్ణమైనది. అది చెప్పుదానిని మనము తప్పక చేయవలెను. మత సంబంధ విషయాల్లో ప్రభువు చెప్పు మాటల చొప్పున ప్రతివారు జరిగించిన యెడల విభజనల శాపము లోకములో యుండక పోవును. అయితే దేవుని వాక్యములో ఆజ్ఞాపింపబడని సంగతులను కొన్నిటిని ఆరాధనలోను, సంఘపాలన పద్ధతిలోను, నామములలోను, ఆచారములలోను ఇప్పుడు కనుగొనుచున్నాము. లేఖనములనధిగమించి వెళ్ళుట యనగా దేవుని కోల్పోవుట యని యోహాను చెప్పుచున్నాడు (2 యోహాను : 9). ఫలాని సంగతిని బైబిలు ఎక్కడ నిషేధించుచున్నది యనునది ప్రశ్నే కాదు గాని దానిని బైబిలు ఎక్కడ ఆజ్ఞాపించుచున్నది యనునది. నిజముగా బైబిలును సరిగా గౌరవించి, అది అధికారమిచ్చు దానినే జరిగించిన యెడల క్రొత్తనిబంధన సంఘము పునరుద్ధరించబడగలదు. బైబిలు మాత్రమే కేవలము క్రైస్తవులను తయారుచేయును !

ఆదిలో క్రైస్తవ్యము ఆచరింపబడినట్లు మనము ఈనాడు ఆచరించిన యెడల మనము ఏ డినామినేషన్‌కు చెందక క్రొత్తనిబంధన సంఘ సభ్యులై క్రైస్తవులుగా మాత్రమే యుందుము. పౌలు, పేతురు, ఆదిమ క్రైస్తవులు ఏ సంఘమునకు చెందియుండిరి ? వారు ఏ డినామినేషన్‌కు సభ్యులు గాక మన ప్రభువు యొక్క సంఘ సభ్యులైరి. క్రొత్తనిబంధన సంఘమునకు శతాబ్దముల తరువాత రోమన్ కేథలిక్కులు ప్రొటెస్టాంటు డినామినేషన్లు వుద్భవించెను.

## క్రీస్తు చిత్తము

ఆదిమ సంఘమునొద్దకు మరలవలసినదని క్రీస్తు సంఘములు విజ్ఞాపన చేయుచున్నవి. క్రీస్తుసంఘములు ఒక మతశాఖ గాని, గుంపు గాని కాదు. పరలోకమందును భూమిమీదను వారికి ఉన్న ఒకే శిరస్సు మన యేసుక్రీస్తు

ప్రభువు. వారి ఆరాధన మానవ కల్పితములతో మిళితము గాక దేవుడు బయలు పరచిన ఆరాధనయై యున్నది. వారి విశ్వాసప్రమాణికము బైబిలు మాత్రమే. బైబిలు తప్ప వేరొకటి ఏమియు లేదు.

మానవ నామములతో ముద్రింపబడక, మానవ ప్రమాణికములతో బంధింపబడక క్రైస్తవునిగా మాత్రమే యుండు మార్గమిది. క్రీస్తునందు మానవులందరు ఏకమైయుండు ఐకమత్య బాట యిది.

క్రీస్తు సంఘమును మీరు దర్శించి, పరిశోధించి, దానిని గూర్చి ప్రశ్నలడిగి తెలిసికొనుడని అది మీకు హృదయపూర్వక ఆహ్వానము నందించుచున్నది.

# యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముటకు గల కారణములు

## ( Why we believe Jesus Christ as the Son of God )

యేసు అను మాటకు రక్షకుడని, క్రీస్తు అనుమాటకు అభిషిక్తుడని అర్థము. అనగా పాపులను రక్షించుటకు దేవునిచే అభిషేకించబడిన వాడని అర్థం. కొందరు యేసు దేవుని కుమారుడని నమ్ముటలేదు. ఆయన ప్రవక్తలతో ఒకడని, ఆయన ఈలోకానికి వచ్చి తిరిగి వెళ్ళిపోగానే ఆయన పని ముగిసిందని వారి వాదన. అయితే ఇదంతయు వ్యర్థమైన వాదన. దేనినైనా మనము బైబిలునుండే సరిచూడాలి. ఎందుకనగా అది దైవావేశము వలన కలిగినది.

బైబిలు యేసునుగూర్చి చాలా స్పష్టముగా చెప్పుచున్నది. ఈ క్రింది కారణముల వలన యేసు దేవుని కుమారుడని తెలిసికొనగలము.

1. యేసు సృష్టికర్త : "ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై యున్నాడు. ఏలయనగా..... సర్వమును ఆయన ద్వారాను ఆయనను

బట్టియు సృజింపబడెను" (కొలస్స 1:15,16). ఆదియందు దేవుడు సృష్టిని సృజించు సమయంలో ఆయన అక్కడ ఉండెను (ఆది. 1:26). క్రీస్తుద్వారా ప్రపంచములు నిర్మించబడెను (హెబ్రీ 1:1,2). "ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను" (యోహాను 1:2). కనుక యేసు దేవుని కుమారుడై యున్నాడు.

**2. యేసు పుట్టుక ఆశ్చర్యకరమైనది :** యేసుక్రీస్తు జననం గురించి దేవుడు ముందుగానే చెప్పెను. ఆది.కా. 3:15, ద్వితి. కా. 18:18; వీటి నెరవేర్పు గలతీ 4:4 లోను అపొ. కా. 3:22 లోను చూడగలము. అనేకమైన ప్రవచనాలు చెప్పబడెను అవి నెరవేరెను. యేసు ఒక పవిత్రకన్యకకు జన్మించెను. మరియు పరిశుద్ధాత్మతో గర్భం ధరించెను. మత్తయి 1:18; యేసు సర్వోన్నతుని దేవుని కుమారుడని పిలువ బడును లూకా 1:32; ఆయన జన్మించునప్పుడు తూర్పుదిక్కున నక్షత్రము పుట్టెను. తూర్పుదేశపు జ్ఞానులు ఆయనను కనుగొని పూజించి కానుకలిచ్చిరి (మత్తయి 2:1,2; 2:10,11). యేసు పాపులను రక్షించుటకు పుట్టిన దేవుని కుమారుడు.

**3. ఆయన జీవితం పవిత్రమైనది :** "ఆయన పాపము చేయలేదు. ఆయన నోట ఏ కపటమును లేదు.... 1పేతురు 2:22 "ఆయన పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడును, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడును, ఆకాశమండలము కంటే మిక్కిలి హెచ్చయినవాడునైన యిట్టి ప్రధాన యాజకుడు మనకు సరిపోయిన వాడు. హెబ్రీ 7:26. ఆయన 30 సం॥లు తల్లితండ్రులకు సహాయపడి 3½ సం॥లు తన్ను పంపిన తన తండ్రి పనిని నిర్వర్తించినాడు. రోగుల యెడల జాలిపడి స్వస్థపరచెను. దూషింపబడియు తిరిగి దూషించలేదు. చివరకు తనను హింసించు చున్నవారి కొరకు కూడా ప్రార్థించెను (లూకా 23:34). ఆయన జీవితమును పాపులకొరకు ధారపోసెను. కనుక ఆయన దేవుని కుమారుడు.

**4. ఆయన మాటలు శ్రేష్ఠమైనవి :** ఆయన ఎప్పుడు మాట్లాడిన తండ్రిని గూర్చి

నిత్య జీవమును గూర్చి మాట్లాడెను. అనేకమైన ఉపమానములు చెప్పెను. తన తండ్రి యింట అనేక నివాసములు కలవని చెప్పెను. ఆయన మాటలకు అందరు విస్మయమొంది "ఇతడు వడ్లవాని కుమారుడు కాడా ? ఇతని తల్లి పేరు మరియ కాదా .... (మత్తయి 13:54). "ఆయన మాటలు వినిన వారందరును ఆయన ప్రజ్ఞకును ప్రత్యుత్తరములకును విస్మయమొందిరి" **(లూకా 2:47).**

**5.** ఆయన క్రియలు దేవుని కుమారుడని ఋజువు చేయుచున్నవి : "మరియు అనేకమైన ఇతర సూచకక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి ఈ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు గాని-యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20: 30,31).

**6. ఆయన తవ మరణ, సమాధి, పునరుత్థానములను బట్టి దేవుని కుమారుడాయెను:** ఆయన పాపులకొరకు చనిపోయెను. ఒక మంచివాని కొరకు ఒకడు చనిపోవచ్చును గాని దుర్మార్గుని కొరకు ఎవరు చనిపోరు (రోమా 5:6-8). అయితే యేసు పాపులకొరకు చనిపోయెను. "మీ అపరాధముల చేతను, పాపముల చేతను మీరు చచ్చినవారై యుండగా ఆయన మిమ్మును క్రీస్తుతో కూడా బ్రతికించెను" **(ఎఫెసీ 2:1).** ఆయన అసాధారణమైన మరణం పొందెను. భారమైన శిలువను భరించి, ముళ్ళ కిరీటము ధరించి పంచ గాయములు పొంది తన శరీరములో ఒక్క రక్తపు బిందువును కూడా ఉంచకుండా అది మానవుల పాపపరిహారార్థం చిందించెను.

ఆయన సమాధి వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేయబడెను. అయితే ఆయన దేవుని కుమారుడు గనుక ఆ భద్రత ఏమీ చేయలేకపోయెను.

ఆయన పునరుత్థానము ఆయన దేవుని కుమారునిగా ఋజువు చేసెను. ఆయన మృత్యుంజయుడై సమాధినుండి తిరిగి లేచెను. ఆయన సమాధినుండి

లేచిన తరువాత అనేకమందికి అగుపడెను (1కొరింథీ 15:5-8). తోమా యేసు గాయాలలో చేయి ఉంచి విశ్వాసముంచెను (యోహాను 20:26-29). ఆయన పునరుత్థానుడగుట వలన మానవులందరికీ నిరీక్షణ కలుగజేసెను. ఆయన మరణ సమాధి పునరుత్థానములే సువార్త (1కొరింథీ 15:1-4). రక్షణ కూడా వీటి మూలముననే కలుగుచున్నది. క్రైస్తవుడు చనిపోయినను క్రీస్తువలె తిరిగి లేచును అనే నిరీక్షణ కలిగియుండును. (1 కొరింథీ 15:20-24).

పై కారణములనుబట్టి యేసు దేవుని కుమారుడు. కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు. మారుమనస్సునొంది, యేసు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొని బాప్తిస్మము తీసికొనినవాడే రక్షింపబడును.

- డి. చిరంజీవి, బండార్లంక.

# ఆయన పునరుత్థాన శక్తి

## (The Power of his Ressurrection)

"..... ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తము" (ఫిలిప్పీ 3:10).

పై వాక్యభాగములో పౌలు ఆయన పునరుత్థాన బలమును గూర్చి మాట్లాడుచున్నాడు. మనము శక్తిగల చైతన్యవంతమైన యుగములో నివసించుచున్నాము. ఆవిరిలో, నీటిలో, విద్యుచ్ఛక్తిలో, ప్రేలుడు పదార్థాలలో, గాలి మొదలగు వానిలో శక్తి ఉన్నదని మనకు తెలుసు. ఈ మధ్యకాలములో అణుశక్తిని గూర్చి పరమాణు శక్తిని గూర్చి మనము వినుచున్నాము. కాని పౌలు వీటికి వేరుగానున్న శక్తిని గూర్చి మాట్లాడుచున్నాడు : అదేమనగా "క్రీస్తు పునరుత్థాన శక్తి".

ఈ క్రింది విధాలుగా ఆ శక్తి బయల్పడుచున్నది.

1. నియమములు మరియు నిర్ణయముల ద్వారా అది స్థాపించబడెను : వాటిలో

ఒకటి సంఘము. ఆయన దానిని వాగ్దానము చేసెను (మత్తయి 16:18). ఆయన పునరుత్థానము ద్వారా సంఘమునకు శిరస్సుగా నియమింపబడెను. (ఎఫెసీ 1:19-23). ఆయన మరణము నుండి లేపబడక పోయినట్లయితే ఆయన సంఘము ఎన్నటికి స్థాపింపబడకపోయి ఉండును. ఆయన సంఘములోనికి ప్రవేశించు అర్హత కల్గియుండుటకు ఆయన పునరుత్థానము ఆధిపత్యము వహించుచున్నది (అపొ.కా. 2:37,38). బాప్తిస్మము అనునది ఆయన మరణ సమాధి పునరుత్థానము లకు చిహ్నమైయున్నది (రోమా 6:3,4; కొలస్స 2:12). ఆయన పునరుత్థానము లేకపోతే, ఆయన వాగ్దానము చేసినట్లుగా ప్రభురాత్రి భోజనములో మనతో కలసి భుజించుట, త్రాగుట జరుగదు (మత్తయి 26:29). ఆయన పునరుత్థానము ప్రభువు దినాన్ని ప్రత్యేక పరచినదది (యోహాను 20:1; మార్కు 16:9; ప్రకటన 1:10).

**2. పునరుత్థానశక్తి వలన విశ్వాసము కలుగును :** క్రీస్తే మెస్సీయా అనియు మరియు ఆయన దైవత్వ స్వభావమును పునరుత్థానశక్తి నిరూపించుచున్నది (అపొ.కా. 2:36; రోమా 1:3, 4). క్రీస్తు పునరుత్థానుడుగా లేపబడకపోతే ఆయన క్రీస్తు ప్రభువుగా అంగీకరింపబడకపోవును. మరియు మన విశ్వాసమునకుమూలములేదు. ఆయన పునరుత్థానము లేకపోతే మన విశ్వాసము వ్యర్థమే (1 కొరింథీ 15:12-17).

**3. పునరుత్థానశక్తి నిరీక్షణను పురికొల్పును :** యేసు సిలువవేయబడి, సమాధి చేయబడినపుడు ఆయన శిష్యులు నిరీక్షణను కోల్పోయారు (లూకా 24:13:21). ఈ నిరీక్షణ పునరుత్థానము ద్వారా ఉజ్జీవింపబడెను. ఈ పునరుత్థానమే జీవముతో కూడిన నిరీక్షణను మనకు కలుగజేయును (పేతురు 1:3,4). పేతురు పునరుత్థాన శక్తిని జీవముతో కూడిన నిరీక్షణగాను, వాడబారని స్వాస్థ్యము గాను వివరించెను. ఈ పునరుత్థానము మనలను సమాధిలోనుండి లేపు ఆయన శక్తియైయున్నది. మరియు మనకు నిరీక్షణను కలుగజేయుచున్నది (యోహాను 5:28,29; 1 థెస్స 4:13,14). ఎంత గొప్ప నిరీక్షణ !

**4. జీవితమును మార్పు చేయుటలో పునరుత్థానశక్తి తోడ్పడును :** పునరుత్థానమునకు ముందు ఆయన శిష్యులందరు భయముతోను, దిగులుతోను నిండియుండిరి (మత్తయి 26:31-35,56,58,69-75). ఆయన పునరుత్థానము తరువాత వారు చాలా ధైర్యవంతులయ్యారు. లోకమంతటికి సువార్తను ప్రకటించ గల గొప్ప సమూహముగా అయ్యారు (మత్తయి 28:18-20; మార్కు 16:15-20; అపో.కా.2:14, 4:18,19; 5:29). క్రీస్తునందు గల నిజమైన విశ్వాసము మరియు ఆయన పునరుత్థానశక్తి ఒకని జీవితమును మార్చును (కొలస్స 3:1-4) పునరుత్థానశక్తి మనలను పాపమునకు లోబడకుండా చేయును (రోమా 6:1-14).

**5. పునరుత్థానశక్తి మరణముపై విజయమును కలుగజేయును :** ప్రపంచములోని మానవజాతి ఒక శతాబ్దములో మూడుసార్లు అంతరించి పోవుచున్నది. ప్రపంచములోని ఏ శక్తి కూడా మరణమును ఆపలేదు. కాని ఆయన పునరుత్థానశక్తి ద్వారా మరణమును జయించగలము (2తిమోతి 1:10). ఆయన పునరుత్థానము మన పునరుత్థానమునకు అభయముగానున్నది (1కొరింథీ 15:20-23, 51-57).

క్రీస్తు పునరుత్థానశక్తి కొరకు దేవునికి వందనాలు. పౌలు తెలుసుకొన్నంతగా ఈ పునరుత్థాన శక్తిని గూర్చి తెలిసికొనగోరుచున్నావా ?

బైబిలు అంతటికి అనగా ధర్మశాస్త్రము, ప్రవక్తలు, సువార్తలు అన్నింటికి ఇది ఆధారముగా నున్నది. మరియు ఆయన పునరుత్థానము యొక్క సత్యాలు ఆయన మంచి వాగ్దానములనన్నిటిని నెరవేర్చును.

- డగ్లస్ హేరిస్, (VOT)

# 10.

# సిలువను గూర్చిన వార్త

## (The Word of the Cross)

సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెఱ్ఱితనము గాని రక్షించ బడుచున్న మనకు దేవునిశక్తి (1కొరింథీ:18) ఇందులో 1) సిలువను గూర్చిన వార్త, 2) నశించుచున్నవారికి వెఱ్ఱితనము, 3) రక్షింపబడుచున్న మనకు దేవునిశక్తి అను భాగములుగా విభజించి దేవుని వాక్యమును పరిశీలింతము.

**1. సిలువను గూర్చిన వార్త సువార్తయైయున్నది :**

సువార్త అనగానేమి ? 1 కొరింథీ 15:1-3, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను, సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను. ఆ సువార్తవలననే రక్షణ పొందువారమై యున్నాము.

దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరుగకుండి నందున సువార్త ప్రకటనయను వెఱ్ఱితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను (1 కొరింథీ 1:21).

సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగ జేయుటకు అది దేవునిశక్తియై యున్నది (రోమా 1:16). ఎందుకనిన నీతిమంతుడని విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాసమూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవునినీతి దానియందు బయలుపర్చబడుచున్నది (రోమా 1:17).

ఇట్లుండగా ధర్మశాస్త్రమునకు వేరుగా దేవునినీతి బయలుపడుచున్నది దానికి ధర్మశాస్త్రమును ప్రవక్తలును సాక్ష్యమిచ్చుచున్నారు. అది యేసుక్రీస్తు

నందలి విశ్వాసమూలమైనదై నమ్మువారికందరికి దేవునినీతియైయున్నది. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా నీతిమంతులముగా తీర్చబడుచున్నాము (రోమా 3:21-22,24).

దేవుడు తన కుమారుడును మన ప్రభువైన యేసుక్రీస్తు విషయమైన ఆ సువార్తను పరిశుద్ధ లేఖనములయందు తన ప్రవక్తల ద్వారా ముందుగా వాగ్దానము చేసెను (రోమా 1:7; గలతీ 3:8).

మన క్రియలను బట్టి గాక తన స్వకీయ సంకల్పమును బట్టియు అనాది కాలముననే క్రీస్తు యేసునందు మనకనుగ్రహింపబడినదియు క్రీస్తు యేసను మన రక్షకుని ప్రత్యక్షత వలన బయలు పర్చబడినదియునైన తన కృపను బట్టియు మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో మనలను పిలిచెను. ఆ క్రీస్తు యేసు మరణమును నిరర్థకము చేసి జీవమును, అక్షయతను సువార్త వలన వెలుగులోనికి తెచ్చెను (2 తిమోతి 1 : 9,10).

మీరు క్షయబీజము నుండి కాక శాశ్వతమగు జీవముగల దేవుని-వాక్యమూలముగా అక్షయబీజము నుండి పట్టింపబడినవారు గనుక నిష్కపటమైన సహోదరప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుట చేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనినవారై యుండి యొకనినొకడు హృదయపూర్వకముగాను మిక్కుటముగాను ప్రేమించుడి. ఏలయనగా సర్వశరీరులు గడ్డిని పోలినవారు. వారి అందమంతయు గడ్డిపువ్వువలెనున్నది. గడ్డి ఎండును దాని పువ్వును రాలును. అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచును. మీకు ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే (1పేతురు 1:22-24).

ఈ మర్మమేదనగా అన్యజనులు సువార్త వలన క్రీస్తు యేసునందు యూదులతో పాటు సమాన వారసులును ఒకే శరీరమందలి సాటి అవయవములును వాగ్దానములో పాలివారునై యున్నారనునదియే (ఎఫెసీ 3:6).

పైన కనుపరచిన వాక్యభాగములను బట్టి సిలువను గూర్చిన వార్తయగు సువార్త యొక్క ప్రాముఖ్యతను గురించి ఎంతో చక్కగా వివరించబడినట్లు తెలిసికొనుచున్నాము. ప్రతి మానవుడు సువార్తను విని విశ్వసించి మారు మనస్సు పొంది యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము (అపొ.కా. 2:38) రక్షణ పొందు నిమిత్తము (మార్కు 16:16, 1పేతురు 3:21) క్రీస్తును ధరించుకొను నిమిత్తము (గలతీ 3:27), పాపములు కడిగివేసుకొను నిమిత్తము (అపొ.కా. 22:16) రోమా 6:3,4 వచనములలో కనుపరచిన రీతిగా బాప్తిస్మము పొందుట ద్వారానే సువార్తకు విధేయత చూపి ఆయన కృపనుబట్టి 1పేతురు 2:9 లో కనుపరచిన రీతిగా ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలుగా యుండగలమని ఆయన వాక్యము చక్కగా వివరించుచున్నది.

2. నశించుచున్న వారికి వెఱ్ఱితనము

నశించుచున్నవారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపక పోయిరి గనుక వాని రాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను నానావిధములైన సూచక క్రియలతోను మహత్కార్యముల తోను దుర్నీతిని పుట్టించు సమస్తమైన మోసముతోను నశించుచున్న వారిలో సాతాను కనుపరచుబలమును అనుసరించి యుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాషగల వారందరును శిక్షావిధి పొందుటకై అబద్ధమును నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు (2 థెస్స 2:9-12).

మరియు వారి మనస్సులు కఠినములాయెను గనుక నేటివరకు పాత నిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపర్చబడక ఆముసుకే నిలిచియున్నది. నేటివరకును మోషే గ్రంథము

వారు చదువునప్పుడెల్ల ముసుకు వారి హృదయముల మీదనున్నది గాని వారి హృదయము ప్రభువు వైపునకు ఎప్పుడు తిరుగునో అప్పుడు ఆ ముసుకు తీసివేయబడును (2 కొరింథీ 3:14-16).

దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమ కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండునట్లు యీ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను (2 కొరింథీ 4:4).

వారి అవివేక హృదయము అంధకారమయమాయెను. తాము జ్ఞానులమని చెప్పుకొనుచూ బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమైన మనుష్యుల యొక్కయు, పక్షులయొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు ప్రతి స్వరూపములుగా మార్చిరి (రోమా 1:22-25).

వారైతే అంధమైన మనస్సు గలవారై తమ హృదయ కాఠిన్యము వలన తమలోనున్న అజ్ఞానముచేత దేవునివలన కలుగు జీవము(సువార్త)లోనుండి వేరు పరచబడిన వారై తమ మనస్సునకు కలిగిన వ్యర్థతను అనుసరించి నడచుకొనుచున్నారు (ఎఫెసీ 4:18).

ఆయనను (క్రీస్తు) అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారమును అనగా ఈలోక సంబంధమైన మూలపాఠములననుసరించి మోసకరమైన నిరర్థక తత్వజ్ఞానము చేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా నుండుడి (కొలస్స 2:8).

అతి వినయాసక్తుడై దేవదూతారాధన యందు యిచ్ఛగలిగి తాను చూచిన వాటిని గూర్చి గొప్పగా చెప్పుకొనుచూ తన శరీర సంబంధమైన మనస్సు వలన ఊరక ఉప్పొంగుచూ శిరస్సును హత్తుకొననివాడు (కొలస్స 2:18). మీరు మీ పారంపర్యాచార నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము

చేయుచున్నారు. వేషధారులారా ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా నున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచూ వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు (మత్తయి 15:6-9).

3. రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి :

రోమా 1:16 లో మనము గమనించిన రీతిగా సువార్తను నమ్ము ప్రతివానిని రక్షించుటకు ఆయన దయాపూర్వక సంకల్పమును బట్టి దేవునిశక్తి అందులో పొందుపరచబడినట్లుగా తెలిసికొనగలుగుచున్నాము. సువార్తకు విధేయత చూపి రక్షణ పొందిన వారందరు క్రీస్తు స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘములో వుండవలయునని అద్వితీయ సత్యదేవుని అభీష్టమైయున్నది. అందుచేతనే కొలస్స 1:13 లో ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులుగా చేసినట్లు తెలిసికొనగలుగుచున్నాము. యింత ప్రాముఖ్యత గలిగిన సువార్తను ఆధారము చేసి మన ఆత్మీయ జీవితము నకు ఎదుగుటకు, ఆయనను ఆత్మతోను, సత్యముతోను ఆరాధించుటకు నిత్యజీవములో ప్రవేశించుటకు ఆధారమైన (1 కొరింథీ 11:25; 2 కొరింథీ 3:6; హెబ్రీ 9:15, 12:24) క్రొత్తనిబంధనను మన స్వంత భాషలో వ్రాయించి అందరికి అందుబాటులో ఉంచబడియున్నది. ఈ క్రొత్తనిబంధన జాగ్రత్తగా చదివి ధ్యానించి సువార్తకు లోబడి రక్షణ పొందిన వారితో చేర్చబడి ఆయన శిరస్సుగానుండిన (కొలస్స 1:18) క్రీస్తు సంఘములో క్రీస్తుబోధయందు పెంచబడుట ద్వారా మీరు నిత్యజీవమును పొందగలరని యీ గొప్ప వర్తమానమును మీకు అందజేయుచున్నాము.

- తోటకూర ప్రకాశరావు, కొమరోలు.

సంఘచరిత్ర :

# మతశాఖల తత్వము సంస్కరణకు అవరోధమాయెను -2

(The Protestant Denominationalism Curbs Reformation - 2)

(గత సంచిక తరువాయి)

## మతశాఖలు ఎందుకు మొదలిడెను ?

ప్రొటెస్టాంటులలో మొదటి సంస్కరణ కర్తలందరు కేథలిక్కు స్వాములే. కేథలిక్కు సంఘములో నైతిక పతనము సంభవించుట వలన వారు దాని నుండి వేరై క్రైస్తవ సిద్ధాంతములలో కొన్నిటిలోనైనను సవరణ జరుగునని కాక్షించిరి, ప్రోత్సహించిరి. వారు కేథలిక్కులుగా పుట్టి, పెరిగి, దానిలోనే విద్యనభ్యసించిన వారు. గనుక కేథలిక్కులలోనుండి వారు బయటకి వచ్చినను, ఆ సంఘము యొక్క ప్రభావమునుండి వారు పూర్తిగా విడుదల పొందినవారు కారు. అయినను వారు వెలికి తీసిన గొప్ప సత్యములు ఆశ్చర్యకరమైనవే.

మార్టిన్ లూథర్ కూడా కేథలిక్కు సంఘమునుండి వేరైపోవాలని, ప్రొటెస్టాంటు ఉద్యమాన్ని ప్రారంభించాలని ఎన్నడు సంకల్పించలేదు, అయితే అసత్యముపై అతడు చేసిన తిరుగుబాటు వలన ప్రజలు సత్యమును అన్వేషించుటకు మొదలిడగా ప్రొటెస్టాంటు ఉద్యమము మొలకెత్తింది. పోపును పోపుగా నేను గుర్తించెదను గాని అతనిని దేవునిగా గుర్తించాలని వారనుచున్నారు అని లూథరు ఒక మారు పలికెను. అతడా సంస్థను గాక దానిలోని అవినీతిని వ్యతిరేకించెను.

కొన్ని సిద్ధాంత విషయాలలో సంస్కరణ కర్తలు విపరీతమైన అంశములను ప్రవేశపెట్టిరి. కేథలిక్కులు "క్రియల వలన మాత్రమే రక్షణ" యని బోధించు చున్నందున లూథరు "విశ్వాసము వలన మాత్రమే రక్షణ" యను సిద్ధాంతమును ప్రవేశపెట్టెను. అయితే యాకోబు పత్రిక అతని భావాలకు వేరుగా యున్నందున దానిని అతడు తిరస్కరించెను. అతడు రోమా పత్రికలో పౌలు విశ్వాసమును

గూర్చి చేసిన బోధను అంగీకరించెను.

అలాగే జాన్‌కేల్విన్ దేవుని కృపను గూర్చి అపార్ధము చేసికొని, కొన్ని అసత్య సిద్ధాంతములను ప్రవేశపెట్టెను. అతడు స్థాపించిన ప్రెస్బిటేరియన్ డినామినేషన్ చేయు బోధలను 2000 ఏప్రియల్ సత్యవాక్కులో కొంత వరకు మనము గమనించాము.

అయితే అబద్ద బోధ ఎక్కడ వున్నదో అక్కడ మనుష్యులు సత్యముతో పోరాడువారై యుందురు. విశ్వాసము వలన మాత్రమే రక్షణయను లూథరు బోధను ప్రతి డినామినేషన్ వారు నేడు బోధింతురు. గాని బైబిలు వారి బోధను ఖండించు చున్నది.

ప్రొటెస్టాంటు నాయకుల మనోభావములు ఎట్లుండెను ? వారు మానవ పారంపర్యాచారములు, అభిప్రాయముల కంటే బైబిలు అధికారయుక్తమైనదని ఎంచినవారే కాని విశ్వాసాచరణముల విషయంలో బైబిలు ఒక్కటిమాత్రమే సంపూర్ణాధికారము కలదని ఎంచినవారు కారు.

మరికొంతమంది బైబిలులో నిశితముగా ఖండింపబడని కేథలిక్కు సంఘము యొక్క సిద్ధాంతములు, ఆచారములు కొనసాగింపబడవచ్చునని భావించారు. ఈ ఆలోచనా సరళికి లూథరే ఒక ఉదాహరణ. తత్ఫలితముగా వివిధ ఆరాధనా పద్దతులు, బోధలు కలిగిన డినామినేషన్లు ఇట్టే ఉద్భవించాయి. ఎందువలన ? వారు లేఖనముల మౌనమును గౌవరించలేనందువలన. "బైబిలు బోధించు విషయాల్లో గాక, అది బోధించని విషయాల్లో మనం విభజించబడి యున్నామని" ఒకాయన చెప్పారు. ("It is not what the Bible says that divides us, but what t doesn't say"). జ్వింగ్లీ లేఖనముల మౌనమును గౌరవించగా, లూథరు అట్లు చేయలేదు. అందువలన ప్రభురాత్రి భోజన విషయంలో వారిద్దరు ఘోరంగా విడిపోయారు.

కొందరు విద్యావేత్తలు వారి సిద్ధాంతాలే యదార్థమని నిరూపించుట కొరకు బైబిలును చదివేవారు. విశ్వాసము వలన మాత్రమే రక్షణయని లూథరు, కృపవలన మాత్రమే రక్షణయని కేల్విన్ బోధిస్తూ వారి బోధను నిరూపించడానికి బైబిలును వాడారు. నా బోధ బైబిలులో యున్నదా లేదా ? యను దానికంటే బైబిలు బోధించునదేమిటి ? యని వారు ఎంచుకోవలసి యుండెను. చివరకు లేఖనముల యెడల వారికున్న బలహీన భావములు సమస్యగా తయారయ్యెను. మతశాఖల తత్వము, విభజనలు ఫలితమాయెను.

## అవి ఎట్లు మొదలిడెను ?

**ఆయా సిద్ధాంతములు ఘనీభవింపజేయబడుట** : ప్రతివారు బలమైన రోమన్ కేథలిక్కులతో కొట్టుమిట్టాడు చున్నందున సంస్కరణోద్యమ ఆరంభములో అందరు ఏకముగా నిలిచిరి. కాని ఈ ఉద్యమము కొనసాగుచుండగా, అదే రకమైన శక్తి సామర్థ్యము గల క్రొత్త నాయకులుద్భవించలేదు. ఉద్యమకర్తల అనుచరులు, ఆయానాయకుల సిద్ధాంతములకొక రూపునిచ్చి, ఘనీభవింపజేసి వారి అనుచరులలో చీలికలు రాకుండ కాపాడుటకు ప్రయత్నించిరి. దాని ఫలితం యేమయ్యింది ? ఒకే లక్ష్యము కొరకై కృషి చేయుచున్నవారు ఒండొరులతో పోరాడవలసి వచ్చినది ! మరియు పౌరోహిత పద్ధతి చొప్పున బంధింపబడినవారైరి. సంస్కరణ ఉద్యమము ఆరంభించబడిన 100 సంవత్సరాల్లో యిది జరిగెను.

**విశ్వాస ప్రమాణములు (Creeds)** : లూథరన్ డినామినేషన్ వారు కేథలిక్కుల సిద్ధాంతమునే ఎక్కువగా ఆచరించుచు, 1530లో తమ కొరకు ఒక విశ్వాస ప్రమాణమును లిఖించుకొని దానినవలంభింప మొదలిడిరి. దానిని ఆగ్స్‌బర్గ్ విశ్వాస ప్రమాణము (Augsburg Confession of Faith) అనియందురు. ఈ కొలబద్దతోనే లూథరన్ సంఘము యొక్క ప్రతి సభ్యుడు కొలవబడవలెను. దాని కొలతకు సరిపోనివారు విసర్జించబడిరి. ఈ విశ్వాస ప్రమాణ పుస్తకము అమలులోకి రాగా

సత్యము కొరకైన అన్వేషణ సమాప్తమాయెను. విశ్వాసప్రమాణ పుస్తకము వ్రాయ బడిన దినమందే సంస్కరణ ఉద్యమము వారికి సమాప్తమాయెను. బైబిలు గాక ప్రమాణ పుస్తకమును అనుసరించు గ్రూపులందరి యెడల యిది వాస్తవమాయెను. మనం బైబిలును మాత్రమే అనుసరించాలి. దానికి ఎక్కువా అక్కర్లేదు. తక్కువా అక్కర్లేదు.

గమనిక : 1908లో మెథడిస్టుల ప్రమాణ పుస్తకం మానవులందరు పాపములోనే గర్భము ధరింపజేయబడి పాపములోనే పుట్టుచున్నారని చెప్పినది. అదే పుస్తకం 1940లో మానవులందరు నిత్యజీవమునకు వారసులు గనుక అందరు ఆ ప్రమాణ పుస్తకాన్ని పరిశుద్ధాత్మ వలన లిఖింపబడిన పత్రముగా అంగీకరించాలని హెచ్చరించినది.

మెథడిస్టుల ప్రమాణపుస్తకం (Methodist Discipline) పరిశుద్ధాత్మావేశము వలన కలిగినదని అంగీకరిస్తే బైబిలు తానే పరిశుద్ధాత్మావేశము వలన కలిగినదని చెప్పుకొనుచున్నందున దాని మాటలనెట్లు విశ్వసించగలము ? (2 తిమో 3:16-19). మెథడిస్టుల ప్రమాణపుస్తకం పరిశుద్ధాత్మావేశము వలన నిజంగా కలిగియుంటే దానిని పదేపదే సవరించవలసిన పని యేమున్నది ? పరిశుద్ధాత్ముడు తన మనస్సును పదేపదే మార్చుకొనుచు యుండునా ?

**వివిధ నామములు :** పైన చెప్పబడిన మెథడిస్టుల ప్రమాణ పుస్తకం ఒక ఉదాహరణ మాత్రమే. దానివలెనే అనేక ప్రమాణము పుస్తకములు లిఖింపబడి, ప్రజలను ఆ ప్రమాణ పుస్తకములకు బద్ధులుగా చేసి వివిధ గుంపులుగా ప్రొటెస్టాంటులు చీలిపోయిరి. ఒక్కోగుంపు ఒకడినామినేషన్‌గా తయారయ్యెను. అంతేకాదు ఒక్కొక్క గుంపు తన రూపురేఖలను కోల్పోకుండుట కొరకు క్రొత్త పేరు ధరించు కొనెను. ఆయా గుంపుల నాయకులు క్రొత్తపేరుతో పిలువబడకూడదని హెచ్చరించినను వారి అనుచరులు విననొల్లక క్రొత్త పేర్లతో తమ గుంపులను

పిలుచుకొన మొదలిడిరి. ఉదాహరణకు మార్టిన్ లూథర్, తన పేరుతో పిలువబడు చున్న డినామినేషన్‌ను గూర్చి యిట్లు చెప్పెను : "మీరు లూథరనులని పిలువబడక క్రైస్తవులనియే పిలువబడుడి. నాపేరు జోలికి పోవద్దని నా ప్రార్ధన. లూథరు యెవడు? నా సిద్ధాంతము నాది కాదు. నేనెవరి కొరకును సిలువ వేయబడలేదు... పనికిమాలిన బూడిద సంచినైన నేను క్రీస్తు బిడ్డలకు నా పేరును ధరింపజేయుటలో కలుగు ప్రయోజనం యేమి ? నా ప్రియ మిత్రులారా, యిది మానుకొనండి. ఈ పార్టీ పేరులు, వ్యత్యాసములను మానుకొనండి. వాటన్నిటినుండి దూరమవ్వండి. క్రైస్తవులమని మాత్రమే మనం పిలవబడుదాం. ఆయన నుండియే మన బోధ ఉద్భవించినది"(Life of Luther by Michelet, Page 262). ఈ వ్యవస్థాపకుని విజ్ఞాపనను ఎవరు వినేలేదు. ఏలయనగా తన అనుచరులు నేటికిని క్రైస్తవులనిగాక లూథరనులని పిలువబడుచున్నారు. ఆ నామము క్రీస్తుయొక్క అధికారము పొందినది కాదు. లూథరు యొక్క ఆమోదము కూడ దానికి లేదు. యిది కొరింథు సంఘమును మనకు జ్ఞాపకము చేయుచున్నది. అపొ.పౌలు వారిని ఈవిధముగా హెచ్చరించెను :

> "సహోదరులారా మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు మీలో కక్షలు లేక యేకమనస్సుతోను, ఏకతాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను. నా సహోదరులారా, మీలో కలహములు కలవని మిమ్మును గూర్చి క్లోయె యింటి వారివలన నాకు తెలియవచ్చెను.
>
> మీలో ఒకడు-నేను పౌలువాడను, ఒకడు నేను అపొల్లోవాడను, మరియొకడు నేను కేఫావాడను, ఇంకొకడు-నేను క్రీస్తువాడనని చెప్పుకొను చున్నారని నా తాత్పర్యము. క్రీస్తు విభజింపబడి యున్నాడా ? పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా ? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా ?" (1కొరింథీ 1: 10-13).

మానవుని నైజము నాటినుండి నేటికిని ఒకేలాగున్నది. రక్షకుడైన క్రీస్తుకు బదులు మానవునినే పైకెత్తు చున్నారు. లూథరన్ డినామినేషన్ యొక్క ఆగ్స్‌బర్గ్ విశ్వాస ప్రమాణము ఆరంభము మాత్రమే. తదుపరి అనేక ప్రమాణపుస్తకములు, నియమావళులు, కట్టడలు, రూలు పుస్తకములు వగయిరాలు వ్రాయబడెను, అంగీకరించబడెను. ఆయా పుస్తకములకు కట్టుబడి యున్నవారందరు వివిధ రీతులుగ చీలిపోయి క్రొత్తనిబంధనకు వేరైన మతశాఖల పద్ధతిని ప్రవేశపెట్టిరి. ఇవన్నియు క్రీస్తు బోధకు వ్యతిరేకమైనవే. అందువలన క్రీస్తు సంఘమును, క్రీస్తు బోధను పునరుద్ధరించుటకు అవసరమాయెను.

చివరగా ఈవిశ్వాస ప్రమాణ పుస్తకములు, మానవకల్పిత నామములు ప్రజలను విడదీసి, సంస్కరణోద్యమమును సాగనియ్యలేదు. బైబిలు యెడల ప్రజలకున్న నిర్లక్ష్యభావము వలన మతశాఖలు ఆవిర్భవించెను.

# ప్రార్థనయందు పట్టుదల కలిగియుండుట
## (Continuing Steadfastly in Prayer)

ప్రార్థన అనగా దేవునితో మాట్లాడుట, మన కృతజ్ఞతలు, విన్నపములు దేవునికి తెలియజేయుట. ప్రియులారా ! మనము ప్రార్థించినపుడు కొన్నిసార్లు సమాధానం వెంటనే రావచ్చును. లేదా కొన్నిసార్లు సమాధానం ఆలస్యంగా రావచ్చును. మరి కొన్నిసార్లు సమాధానం అసలే రాకపోవచ్చును. మనము విశ్వాసమును కోల్పోవనవసరం లేదు.

**1. కొన్నిసార్లు మనం అడిగినవే ఇస్తాడు :**

ఉదా : హన్నా విషయమై ఆలోచించినపుడు, ఆమె భోజనము మానివేయుటయు, ఏడ్చుటయు విచారము కల్గి తన జీవితమును గడుపుచుండెను. ఒకరోజు ఆమె బహు దుఃఖాక్రాంతురాలై వచ్చి యెహోవా సన్నిధిని ప్రార్థన చేయుచు బహుగా

ఏడ్చుచూ సైన్యముల కధిపతియగు యెహోవా ! నీ సేవకురాలనైన నాకు మగపిల్లను దయచేసిన యెడల వాని తలమీదికి క్షౌరపుకత్తి యెన్నటికిని రానియ్యక వాడు బ్రతుకు దినములన్నిటను నేను వానిని యెహోవాయగు నీకు అప్పగింతునని మ్రొక్కుబడి చేసికొనెను. ఆమె యెహోవా సన్నిధిని ప్రార్ధన చేయుచుండగా ఏలీ ఆమె నోరు కనిపెట్టుచుండెను (1సమూయేలు 1:10,11).

యెహోవా ఆమెను జ్ఞాపకము చేసికొనెను గనుక హన్నా గర్భము ధరించి దినములు నిండినపుడు ఒక కుమారుని కని నేను యెహోవాకు మ్రొక్కుకొని వీనిని అడిగితిననుకొని వానికి సమూయేలను పేరుపెట్టెను. (1సమూయేలు 1:19, 20)

## 2. కొన్నిసార్లు అడిగిన దానికంటె ఎక్కువ యిస్తాడు :

ఉదా : దావీదు కుమారుడైన సొలోమోను గూర్చి ఆలోచించినపుడు అతడు బాలుడుగా రాజ్య పరిపాలన చేయుటకు రాజరికమును చేపట్టినపుడు ఇశ్రాయేలీయులను పాలన చేయుటకు కావలసినంత జ్ఞానం లేనపుడు అతడు దేవున్ని అడిగాడు. అతడు అడిగిన దానికంటె ఎక్కువగా దేవుడు అతనికి దయచేసాడు. "ఇంత గొప్పదైన నీ జనమునకు న్యాయము తీర్చగలవాడు ఎవ్వడు? కాబట్టి నేను మంచి చెడ్డలు వివేచించి నీ జనమునకు న్యాయము తీర్చునట్లు నీ దాసుడనైన నాకు వివేకము గల హృదయము దయచేయుము అని ప్రార్థించెను. దేవుడు - "దీర్ఘాయువునైనను, ఐశ్వర్యమునైనను, నీ శత్రువుల ప్రాణమునైనను అడుగక న్యాయంబనుగ్రహించుటకు వివేకము అనుగ్రహించుమని నీవు అడిగితివి. నీవు ఈలాగున అడిగినందున నీ మనవి ఆలకించుచున్నాను. బుద్ధి వివేకములు గల హృదయము నీకిచ్చుచున్నాను. పూర్వీకులలో నీవంటి వాడు ఐశ్వర్యమును ఘనతను ఇమ్మని అడగకపోయినను నేను వాటిని కూడ నీకిచ్చుచున్నాను. అందువలన నీ దినములన్నిటను రాజులలో నీవంటి వాడొకడైనను నుండడు" (1 రాజులు 3:9-13).

**3. కొన్నిసార్లు అడిగినవి యివ్వక పోవచ్చును :**

అపొస్తలుడైన పౌలును గూర్చి ఆలోచించినపుడు-"నాకు కలిగిన ప్రత్యక్షతలు బహు విశేషముగా ఉన్నందున నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము నాకు శరీరములో ఒక ముల్లు, నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము నన్ను నలుగగొట్టుటకు సాతాను యొక్క దూతగా ఉంచబడెను.

అది నాయొద్దనుండి తొలగిపోవలెనని దాని విషయమై ముమ్మారు ప్రభుని వేడుకొంటిని. అందుకు-నా కృప నీకు చాలును. బలహీనతయందు నాశక్తి పరిపూర్ణ మగుచున్నదని ఆయన నాతో చెప్పెను" (2కొరింథీ 12:7-9). యిది క్రైస్తవులమైన మనకు గొప్ప పాఠమైయున్నది. ఎందుకనగా మన శారీరకమైన సమస్యలలోను, బాధలలోను, కష్టాలలోను, ఆపదలలోను ప్రభువు కృపయే చాలును. బాధలను, కష్టాలను తీసివేయమని ప్రభువుని పదే పదే అడుగుటకన్నా ఆయన కొరకై ఆయన కృప గలిగి జీవించుట ముఖ్యము. ఎందుచేతననగా-బాధలైనా, కష్టాలైనా శరీర రుగ్మతలు ఏవైనా అవి ఈలోక పరిమితి వరకే. అవి అశాశ్వతమైనవి. పౌలు మరో చోట ఈవిధముగా చెప్పుచున్నాడు-"క్షణ మాత్రముండు మా చులకని శ్రమ మా కొరకు అంతకంతకు ఎక్కువగా నిత్యమైన మహిమ భారమును కలుగజేయు చున్నది. ఏలయనగా-దృశ్యమైనవి అనిత్యములు అదృశ్యమైనవి నిత్యములు" (2కొరింథీ 4:18).

ప్రియులారా ! ప్రార్థన అనేది ఎవరికొరకు చెయ్యాలో బైబిలు చెప్పుచున్నది. ఎప్పుడు చెయ్యాలో, ఎట్లు చెయ్యాలో కూడ అది చెప్పుచున్నది.

**A. ఎవరి కొరకు ప్రార్థన చేయవలెను ? :**

a) రాజుల కొరకు, అధికారుల కొరకు ప్రార్థన చేయవలెను (1తిమోతి 2:2).

b) రోగుల కొరకు ప్రార్థన చేయవలెను (యాకోబు 5:15).

c) శ్రమలోనున్న వారికొరకు ప్రార్థన చేయవలెను (అపొ.కా. 12:5).

d) సంఘ క్షేమాభివృద్ధి కొరకు ప్రార్థన చేయవలెను (అపొ.కా. 12:12).

e) శత్రువుల కొరకు హింసించు వారికొరకు ప్రార్థన చేయవలెను (మత్తయి 5:43-46).

**B.** ప్రార్థన ఎప్పుడు చేయవలెను ? :

a) యెడతెగక ప్రార్థన చేయవలెను (అపొ.కా. 2:42, 1థెస్స 5:15).

b) నిలకడగా ఉండి ప్రార్థన చేయవలెను (కొలస్స 4:2).

c) విసుగక నిత్యము ప్రార్థన చేయవలెను (లూకా 18:1).

d) తగ్గించుకొని, దీనమనస్సు కల్గి ప్రార్థన చేయవలెను (లూకా 18:13,14).

**C.** ప్రార్థన ఎట్లు చేయవలెను ? :

a) మెలకువగాయుండి ప్రార్థన చేయవలెను (కొలస్స 4:2).

b) ఆసక్తితో ప్రార్థన చేయవలెను (యాకోబు 5:17).

c) ఆత్మతోను, మనస్సుతోను ప్రార్థన చేయవలెను (1కొరింథీ 14:15).

d) పూర్ణమైన పట్టుదలతో ప్రార్థన చేయవలెను (ఎఫెసీ 6:18; 1పేతురు 3:12).

గమనిక : నీ ప్రార్థన వేషధారులవలె ఉండకూడదు. వేషధారులైతే "మనుష్యులకు కనబడవలెనని సమాజ మందిరములలోను, వీధులమూలలోను నిలచి ప్రార్థన చేయుట వారికిష్టము. వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" అని యేసుక్రీస్తు చెప్పెను (మత్తయి 6:5).

నీవైతే-నీవు ప్రార్థన చేయునపుడు నీ గదిలోనికి వెళ్ళి తలుపువేసి రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు

ప్రతిఫలమిచ్చును. మరియు మీరు ప్రార్థన చేయునపుడు అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు. విస్తరించి మాటలాడుట వలన తమ మనవి వినబడునని వారు తలంచుచున్నారు. మీరు వారివలె ఉండకుడి..... (మత్తయి 6:6-8,33).

## ముగింపు :

ప్రియ మైన సోదరా, సోదరీ, నీవు అడిగినవి పొందగలననే నమ్మకముతో ప్రార్థన చెయ్యి. మనస్సులో సందేహం లేకుండా విశ్వాసంతో ప్రార్థన చెయ్యి. నీవు అడిగినవి ఆయన చిత్తప్రకారముంటే పొందగలవు. క్రైస్తవ జీవనంలో ప్రార్థన చాలా ప్రాముఖ్యమైనది. ప్రార్థనలేని జీవితం పైకప్పు లేనటువంటి యిల్లువలె యుండును. గనుక ప్రార్థనలో గొప్ప శక్తి ఉన్నది. అందుకే ప్రార్థనయందు పట్టుదల కల్గియుండుడని పరిశుద్ధాత్మ దేవుడు క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు. మరి నీ పరిస్థితి ఏమిటి ? నీవు క్రైస్తవుడయ్యావా ? లేనట్లయితే యిప్పుడే క్రీస్తునందు విశ్వా సముంచుము. నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది క్రీస్తుని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందుము. ప్రార్థనయందు పట్టుదల కల్గియుండుము.

- జె.కె. ఏలియా, క్రీస్తుసంఘం,
గుడ్డిగూడెం.

కె. జయరాజుగారు సువార్త కూటములో వాక్యపరిచర్య చేసిరి. ఆనాడు ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

జూన్ 20 వ తేదీ మంగళవారం అమలాపురం పట్టణం గ్రేస్‌లాండ్ క్రీస్తుసంఘ ఆవరణలో సువార్తికుల సదస్సు గంభీరముగా జరిగెను. పలు ప్రాంతముల నుండి సువార్తికులు సకాలమునకు హాజరైరి. అందరు ఆనందోత్సాహములతో గొప్ప సహవాసములో పాలుపొందిరి. "రక్షణ పొందుటకు విధేయతతో కూడిన విశ్వాసము అవసరమా?" యను అంశమును సోదరులు సవిస్తరముగా చర్చించిరి.

సోదరులు యస్.జె. మోహనరావ్ (కొత్తపేట), డి. ఇశ్రాయేలు రాజా (కొండుకుదురు) గార్లు పాటలు నడిపించిరి. స్థానిక సువార్తికులు ఆర్. సామ్యూల్ గారు కొత్తనిబంధన సత్యముపై ఆధారపడి వ్రాసిన కొత్త కీర్తన నొకదానిని వినిపించిరి, నేర్పించిరి. స్థానిక క్రీస్తుసంఘము, ఆర్. సామ్యూల్ గారు, వారి కుటుంబసభ్యులు గట్టిగా శ్రమించి సదస్సును జయప్రదము గావించిరి. వచ్చిన వారందరికి మంచి భోజనపానాదులనిచ్చిరి. అమెరికానుండి తిరిగివచ్చిన జాన్ రిక్కీ గూటంగారు కూడ ఈ సదస్సులో పాల్గొని ఆనాటి ఆఖరి వర్తమానము నందించి సభికులను ముగ్ధులను చేసిరి.

సోదరులు యస్.జె. మోహనరావ్ గారి ప్రార్ధనతో సదస్సు ఆరంభమాయెను. సోదరులు పాల్‌గూటం (గొల్లవిల్లి), బూల యోహాను (పల్లంకుర్రు), వడ్డి చిన్నయ్య (కడలి), డి. రంగారావ్ (గొల్లవిల్లి), దేవరపల్లి చిరంజీవి(బండార్లంక), జాషువా గూటం, రిక్కీ గూటం గార్లు వాక్యపరిచర్య చేసి పై అంశమును సవిస్తరముగా చర్చించిరి. సోదరులు జి. షడ్రక్ (పాలకొల్లు) గారి ప్రార్ధనతో సదస్సు ముగిసెను.

రక్షణ పొందవలెనంటే విశ్వాసము ఒక్కటి మాత్రమే సరిపోదు. దానికి క్రియలు కూడా జోడించాలి. అవి ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు కావు. ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల వలన ఎవడును నీతిమంతుడుగా తీర్చబడడు. గాని క్రొత్తనిబంధన విశ్వాసమునకు విధేయులైన వారిని గూర్చి, సువార్తకు విధేయులైన వారిని గూర్చి చెబుతుంది (అపొ.కా.6:7). ఒకడు యేసు ప్రభువునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది,

యేసే దేవుని కుమారుడని ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు విశ్వాసమునకు విధేయుడవుతాడు. అతని విశ్వాసము, విధేయత అంతటితో ఆగిపోదు గాని, మరణ పర్యంతము అతడు విశ్వాసము కలిగి యుండాలి. దేవునికి విధేయత చూపుతూ యుండాలి. మరణ పర్యంతము నమ్మకముగా, విధేయతతో జీవించిన వారికే జీవకిరీటం. తమ విశ్వాసమునకు విధేయులైన వారికే యేసుప్రభువు నిత్యరక్షణకు కారకుడని సోదరులు హెచ్చరించిరి.

జూన్ 24వ తేదీ శనివారం రాజమండ్రి శ్యామలాంబ గుడి వీధిలో కూడుకొనుచున్న సంఘము నిర్మించుకొనిన ఆరాధన స్థలమును జాషువా గారు రిబ్బను కత్తిరించి ప్రారంభించిరి. తదుపరి జరిగిన సువార్త కూటములో సోదరులు వి. సుదర్శన రావ్, జయపాల్ (బైపాస్‌రోడ్) మరియు జాషువా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు యస్. జెకర్యా గారి పని ఫలితముగా ఈ సంఘము అభివృద్ధి జెందెను. ప్రస్తుతము గుడాల శ్యామల రావ్ గారు ఆ సంఘాభివృద్ధికి కృషి చేయుచున్నారు. ☆

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :

SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001.

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam